సాక్షి
యాదాద్రి భువనగిరి

శుక్రవారం । 17 । అక్టోబర్ । 2025



ఆఖరి మజిలీకి అవస్థలు
భూదాన్‌పోచంపల్లి మున్సిపల్ కేంద్రంలో శ్మశానవాటిక నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. - IIIలో



రైతుల అభ్యున్నతికి కృషి
రైతుల సంక్షేమమే ధ్యేయమని, తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని ప్రభుత్వ విప్ ఐలయ్య పేర్కొన్నారు. - IIIలో



బంద్‌ను జయప్రదం చేయాలి
18న నిర్వహించతలపెట్టిన రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలని బీసీ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. - IIIలో

న్యూస్‌రీల్

కలెక్టరేట్‌లో ప్రజావాణి

భువనగిరిటౌన్ : కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పలువురు వినతులు అందజేశారు. కలెక్టర్ హనుమంతరావు వినతులు స్వీకరించడంతో పాటు బాధితులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అదే విధంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. నూతన ఓటర్లకు గుర్తింపు కార్డులు జారీ చేయాలని ఆదేశించారు. అనంతరం ఎన్నికల అధికారులు, సహాయ ఎన్నికల అధికారులు, తహసీల్దార్లతో కలెక్టర్ సమావేశం ఏర్పాటు చేశారు. తపాల శాఖ ద్వారా గుర్తింపు కార్డుల జారీకి చర్యలు తీసుకోవాలని సూచించారు.

మత్స్యగిరీశుడి హుండీ ఆదాయం రూ.11.93 లక్షలు

వలిగొండ : మండలంలోని వెంకటాపురంలో గల శ్రీ మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయ హుండీల్లో భక్తులు సమర్పించిన నగదు, ఇతర కానుకలను గురువారం లెక్కించారు. 114 రోజులకు నగదురూపంలో రూ.11,93,431 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈఓ మోహన్‌బాబు తెలిపారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ భాస్కర్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కొమ్మారెడ్డి నరేష్‌రెడ్డి సమక్షంలో హుండీ ఆదాయాన్ని లెక్కించారు.

సెల్లార్లను 31లోగా ఖాళీ చేయాలి



భవన యజమానుల సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

భువనగిరిటౌన్ : సెల్లార్లలో ఏర్పాటు చేసిన దుకాణాలను ఈనెల 31లోపు ఖాళీ చేయాలని అనదపు కలెక్టర్ భాస్కర్‌రావు భవన యజమానులను ఆదేశించారు. భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని భవనాల యజమానులతో గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సెల్లార్‌లను వాహనాల పార్కింగ్ కోసమే వినియోగించాలని, ఇతర అవసరాలకు వినియోగించరాదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే భవనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. సెల్లార్లలో దుకాణాలు నిర్వహిస్తున్న వారందరికీ నోటీసులు జారీ చేస్తున్నట్లు తెలిపారు. జగదేవ్‌పూర్ చౌరస్తాలో ఉన్న జన్మభూమి మడిగెల్లో మున్సిపాలిటీ కేటాయించిన వారు మాత్రమే ఉండాలని, సబ్ లీజ్ దారులు వెంటనే ఖాళీ చేయాలని సూచించారు. సోమవారం లోపు మడిగెల యజమానులకు నోటీసులు జారీ చేయాలని అధికారులకు ఆదేశించారు. మడిగెల నుంచి మున్సిపాలిటీకి పూర్తిస్థాయిలో పన్ను రావడం లేదని, 115 షాపులకు గాను రూ.48.40 లక్షలు బకాయి ఉందని, వెంటనే వసూలు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామలింగం, సిబ్బంది పాల్గొన్నారు.

18 నుంచి జువైనల్ కేసుల విచారణ

భువనగిరిటౌన్ : జిల్లాలోని జువైనల్ కేసుల విచారణ ఈనెల 18వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జువైనల్ కేసుల విచారణకు వారంలో ఒక రోజు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు.జువైనల్ జస్టిస్ బోర్డు న్యాయమూర్తిగా భువనగిరి అదనపు జ్యూడీషియల్ మెజిస్ట్రేట్ జడ్జిగా వ్యవహరిస్తారని తెలిపారు. జువైనల్ జస్టిస్ బోర్డును భువనగిరిలోని పాత మునిసిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

కొనుగోలు కేంద్రాల సందర్శన



కక్కిరేణిలో రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

రామన్నపేట: రామన్నపేట మండలంలోని పల్లివాడ, కక్కిరేణి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం అదనపు కలెక్టర్ వీరారెడ్డి సందర్శించారు. ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. వరి చేను పక్వానికి వచ్చిన తరువాతే కోత కోయాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు పూర్తయ్యాయని, ప్రైవేట్‌కు విక్రయించి నష్టపోవద్దని చెప్పారు. కేంద్రాల నిర్వాహకులకు సహకరించాలని కోరారు. రైతులకు అసౌకర్యం కలుగకుండా కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ లాల్‌బహదూర్‌శాస్త్రి, పీఏసీఎస్ సీఈఓ జంగారెడ్డి ఉన్నారు.

'హ్యామ్'కు పచ్చజెండా



డబుల్ లేన్‌గా మారనున్న రఘునాథపురం - చల్లూరు రహదారి

129.9 కిలో మీటర్ల మేర రహదారుల అభివృద్ధి

- అవసరమైన చోట కొత్త రోడ్లు, ఉన్నవాటిని డబుల్, ఫోర్ లేన్‌గా విస్తరణ
- పనులు పూర్తయితే సులభతరం కానున్న ప్రయాణం, తగ్గనున్న ప్రమాదాలు
- నేడు టెండర్లకు ఆహ్వానం



తుర్కపల్లి మండలం మల్కాపురం వద్ద ప్రమాదకరంగా ఉన్న డబుల్ రోడ్డు

సాక్షి, యాదాద్రి: జిల్లాలో రహదారుల అభివృద్ధికి మోక్షం కలగనుంది. నూతన రోడ్ల నిర్మాణంతో పాటు ఇరుకు రోడ్ల విస్తరణకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. హైబ్రిడ్ ఆన్యూటీ మోడ్‌లో (హ్యామ్) పద్ధతిలో పనులు చేపట్టనుంది. 40 శాతం నిధులను ప్రభుత్వం, 60 శాతం కాంట్రాక్టు సంస్థలు వెచ్చించనున్నాయి. పనులకు శుక్రవారం టెండర్లు పిలువనున్నారు.

129.9 కిలో మీటర్ల మేర.. జిల్లాలో 129.9 కిలో మీటర్ల మేర రహదారులను హ్యామ్ విధానంలో అభివృద్ధి చేయనున్నారు. సింగిల్ రోడ్లను డబుల్ లేన్‌గా, డబుల్ రోడ్లను నాలుగు వరుసలుగా విస్తరించనున్నారు. అదే విధంగా రహదారులు సరిగా లేని ప్రాంతాల్లో కొత్తవాటిని నిర్మాణం చేయనున్నారు. దీంతో పాటు కల్వర్టులు, వంతెనలు, డివైడర్లు, ప్రమాదాల నివారణకు మూలమలుపుల వద్ద సైడ్ వాల్స్, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయనున్నారు.

భువనగిరి - చిట్యాల రోడ్డుకు రూ.28 కోట్లు

భువనగిరి – చిట్యాల రోడ్డుకు భువనగిరి నియోజకవర్గ పరిధిలో రూ.28 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో భువనగిరి, నాగిరెడ్డిపల్లి, టేకులసోమారం, వలిగొండ మండల కేంద్రం, నాగారం, తుమ్మలగూడెం, బోగారం, రామన్నపేట మండల కేంద్రం నుంచి చిట్యాల మండల కేంద్రం వరకు రోడ్డును అభివృద్ధి చేయనున్నారు. ఇదే రహదారికి నకిరేకల్ నియోజవర్గ పరిధిలో 15.60 కిలో మీటర్ల మేర ఉంది. ఈ మార్గం యాదాద్రి భువనగిరి, నల్లగొండ జిల్లాల పరిధిలో జాతీయ రహదారుల తరువాత అత్యంత రద్దీగా ఉంటుంది. దక్షిణ–ఉత్తర భారతదేశం మధ్య వివిధ ప్రాంతాలకు ప్రధాన వారధి. నిత్యం వేలాది వాహనాలతో రద్దీగా ఉండే ఈ రహదారి అభివృద్ధి జరిగితే ప్రమాదాలకు అడ్డుకట్ట పడే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా తక్కువ వ్యవధిలో వాహనదారులు తమ గమ్యస్థానాలకు చేరుకోవచ్చు.

ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో..

ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో రహదారులను అభివృద్ధి చేయనున్నారు. ప్రభుత్వ నిర్ణయం వల్ల గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు, మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాలు, జిల్లా కేంద్రం నుంచి రాష్ట్ర రాజధానికి వెళ్లే రహదారులకు మహర్దశ చేకూరనుంది. కాగా కాంట్రాక్టు సంస్థలు చేసిన పనులకు ఒకే దఫాలో కాకుండా దశల వారీగా వాయిదా పద్ధతిలో నిర్దేశిత సమయంలోగా ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తుంది.

ఈ రహదారులకు మహర్దశ

- తుర్కపల్లి నుంచి బొమ్మలరామారం మండలం రంగాపూర్ వరకు రహదారిని 17.80 కిలో మీటర్ల మేర అభివృద్ధి చేయనున్నారు. వయా మల్కాపూర్, బద్దుతండా, మాదాపూర్, రామస్వామితండా, చీకటిమామిడి, కాజీపేట, బొమ్మలరామారం మీదుగా రంగాపూర్ వరకు రహదారిని అభివృద్ధి చేస్తారు.
- నాగారం నుంచి వయా ఎస్.లింగోటం, నేలపట్ల, జైకేసారం, నెమలికాల్వ గ్రామాల మీదుగా చౌటుప్పల్ వరకు 6.50 కిలో మీటర్లు అభివృద్ధి.
- ఆలేరు పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి జగ్‌దేవ్‌పూర్ పీడబ్ల్యూడీ రహదారి వరకు వయా రఘునాథపురం, చల్లూరు, ఇబ్రహీంపూర్, వీరారెడ్డిపల్లి వరకు 28.20 కి.మీ డబుల్ లేన్ చేస్తారు. తద్వారా మెదక్, సిద్దిపేట, సంగారెడ్డికి సాఫీగా ప్రయాణం చేయొచ్చు.
- ఆలేరు నుంచి జనగామ జిల్లా జీడికల్ వరకు వయా సాయిగూడెం, కొల్లూరు, శారాజీపేట, జనగామ జిల్లా జీడికల్ రోడ్డు వరకు 12.50కి.మీ.
- జనగామ జిల్లా జీడికల్ రోడ్డునుంచి మోత్కూరు వరకు వయా అనంతారం, సుద్దాల, బ్రాహ్మణపల్లి, రామారం, గుండాల మండల కేంద్రం, నుంచి మోత్కూరు వరకు 26 కిలో మీటర్లు.
- రాయగిరి–మోత్కూరు రోడ్డు నుంచి బండసోమారం, చందుపట్ల మీదుగా భువనగిరి–చిట్యాల రోడ్డు వరకు 15.50 కిలో మీటర్లు
- మునుగోడు నియోజకవర్గంలోని చౌటుప్పల్ నుంచి వలిగొండ మండలం నాగారం వరకు.. వయా ఎస్.లింగోటం, నేలపట్ల, జైకేసారం, వలిగొండ మండలం జాలుకాలువ, నెమిలకాల్వ వరకు 12 కి.మీ మేర రోడ్డు అభివృద్ధి చేయనున్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే మెరుగైన సేవలు



గర్భిణికి చీర, పండ్లు అందజేస్తున్న కలెక్టర్ హనుమంతరావు, చిత్రంలో అదనపు కలెక్టర్, అధికారులు

- కలెక్టర్ హనుమంతరావు

భువనగిరిటౌన్ : ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే నాణ్యమైన వైద్యసేవలు అందుతాయని, గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ హనుమంతరావు సూచించారు. పోషణమాసంలో భాగంగా భువనగిరిలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం జిల్లా సంక్షేమ శాఖ అధ్వర్యంలో గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసం చేశారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ హాజరై మాట్లాడారు. గర్భిణులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని, తద్వారా తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. వైద్యుల సూచన మేరకు వైద్యసేవలు పొందాలన్నారు. ప్రీ ప్రైమరీ స్కూళ్లలో పిల్లల నమోదు పెంచాలని అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు మెరుగుపర్చడంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ టీచర్లతో సమీక్ష సమావేశాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలను త్వరలోనే ప్రాథమిక పాఠశాల్లో కలుపనున్నట్లు తెలిపారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ అవేజ్ చిస్తీ మాట్లాడుతూ సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అమలయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ మనోహర్, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, ఐసీడీఎస్ సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధ విన్నారు.. భరోసా ఇచ్చారు



దివ్యాంగుడు కొమ్మగాని రవితో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

యాదగిరిగుట్ట రూరల్: మండలంలోని పెద్దకందుకూరులో బుధవారం కలెక్టర్ హనుమంతరావు ఇందిరమ్మ ఇళ్ల పరిశీలనకు వచ్చారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన దివ్యాంగుడు కొమ్మగాని రవి తల్లి లక్ష్మి తమ కుటుంబం పేదరికంతో ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టర్‌కు విన్నవించారు. తన కుమారుడు పుట్టుకతో దివ్యాంగుడని, ఇంట్లో ఇద్దరమే ఉంటామని, చిన్న డబ్బాకొట్టు ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నామని తెలిపింది. పూటగడవడం కష్టంగా ఉందని, ఆదుకోవాలని కలెక్టర్‌ను వేడుకుంది. వెంటనే స్పందించిన కలెక్టర్.. బ్యాంకు అధికారికి ఫోన్‌చేసి రవికి లోన్ ఇవ్వాలని ఆదేశించారు. బ్యాటరీతో నడిచే ట్రై వాహనాన్ని కూడా ఇప్పిస్తానని కలెక్టర్ రవికి హామీ ఇచ్చారు.

రెవెన్యూ ఉద్యోగుల జిల్లా కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన రెవెన్యూ ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా కార్యవర్గం

భువనగిరిటౌన్ : తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా కమిటీని గురువారం భువనగిరిలో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఎం.కృష్ణ, కార్యదర్శిగా ఆర్. శ్రీకాంత్, కోశాధికారిగా జానయ్య, అసోసియేట్ అధ్యక్షులుగా ఎండీ లాయిఖ్‌అలీ, సీహెచ్ శోభ, మరో 19 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ వీరారెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి, టీజీఓ రాష్ట్ర కోశాధికారి మందడి ఉపేందర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. రెవెన్యూ ఉద్యోగులు ఐక్యంగా ఉంటూ తమ సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో భువనగిరి ఆర్డీఓ కృష్ణారెడ్డి, టీజీఓ జిల్లా అధ్యక్షుడిగా చికురి జగన్‌మోహన్‌ప్రసాద్, టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడిగా భగత్ పాల్గొన్నారు. ఎన్నికల అధికారులుగా నారాయణరెడ్డి, నిరంజన్ వ్యవహరించారు.

ఉద్యోగం వేటలో ఉన్నారా..

డీఈఈటీ యాప్‌లో వివరాలు నమోదు చేసుకోండి

- నిరుద్యోగ యువతకు సమాచారం కోసం ప్రత్యేక యాప్ రూపకల్పన
- ప్రభుత్వ కార్యాలయాలు, జనరద్దీ ప్రాంతాల్లో యాప్ పోస్టర్లు ఏర్పాటు



కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన డీఈఈటీ యాప్ పోస్టర్

భువనగిరిటౌన్ : ప్రతి సంవత్సరం వేలాది మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి బయటకు వస్తున్నారు. చాలామంది ఉద్యోగాలు ఎక్కడ ఖాళీగా ఉన్నాయో తెలుసుకోలేక పోతున్నారు. ఇలాంటి వారికోసం తెలంగాణ సర్కార్ ప్రత్యేకంగా ఓ యాప్‌ను రూపొందించింది. అదే డిజిటల్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ (డీఈఈటీ). చదువు పూర్తయిన వారు, వివిధ కోర్సుల్లో చివరి సంవత్సరంలో ఉన్నవారు డీట్ యాప్ deet. telangana.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చు.

నమోదు చేసుకునే విధానం..

అభ్యర్థులు తమ పేరు, వ్యక్తిగత వివరాలు, విద్యార్హత, అనుభవం, నైపుణ్యం తదితర వివరాలను యాప్‌లో నమోదు చేసుకోవాలి. వీటికి సంబంధించిన సర్టిఫికెట్‌లను అప్‌లోడ్ చేయాలి. ఆ తరువాత ప్రైవేట్ రంగంలోని ప్రతి కంపెనీ, సంస్థల్లో ఉన్న ఉద్యోగాల వివరాలు వస్తాయి. ఆ సంస్థకు కావాల్సిన నైపుణ్యాలు, వేతనం, అనుభవం వివరాలు కనిపిస్తాయి. అవి ఓకే అనుకుంటే సంబంధిత ఉద్యోగానికి దరఖాస్తు చేసుకోవచ్చు. ఆ తరువాత సంస్థ ప్రతినిధులు యాప్‌లోనే మీ వివరాలు తెలుసుకుంటారు. ఇంటర్వ్యూ ప్రాంతం, ఇంటర్వ్యూ చేసే వ్యక్తి, సమయం వివరాలు తెలియజేస్తారు. వివిధ రంగాల్లో ఉన్న పోస్టులు, కొత్త అప్‌డేట్‌ల గురించి ఈ యాప్‌లో నోటిఫికేషన్లుగా ఇస్తుంటారు.


జనరద్దీ ప్రాంతాల్లో యాప్ పోస్టర్లు

నిరుద్యోగులు ఎక్కడి నుంచైనా తమ వివరాలను యాప్‌లో నమోదు చేసుకునేందుకు వీలుగా ఉపాధి కల్పన శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ప్రభుత్వ కార్యాలయాలతో పాటు, ప్రజలు ఎక్కువగా తిరిగే ప్రదేశాల్లో క్యూఆర్‌తో కూడిన డీప్ యాప్ పోస్టర్లను ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం కలెక్టరేట్‌లో వాటిని ఏర్పాటు చేశారు.

'ఉపాధి హామీ'లో జలసంరక్షణ

భూగర్భ నీటి మట్టం పెంపు పనులకు ప్రాధాన్యం

- కార్యాచరణ సిద్ధం చేసిన డీఆర్‌డీఏ
- గ్రామసభల నిర్వహణకు సన్నాహాలు
- ప్రజల ఆమోదంతో పనుల గుర్తింపు



ఆలేరు: వచ్చే ఆర్థిక సంవత్సరానికి గాను జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఏ) అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. ఇందులో భాగంగా జలసంరక్షణ పనులకు అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవడంతో పాటు వాటిని సంరక్షించుకుంటే రాబోయే రోజుల్లో నీటి ఎద్దడి నుంచి గట్టెక్కవచ్చని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. వచ్చే ఏడాది నుంచి ఉపాధిహామీలో జలసంరక్షణ పనులు విరివిగా చేపట్టాలని సూచించింది. ఈ మేరకు అధికారులు పనులను గుర్తించారు.

నవంబర్ 30 వరకు గ్రామసభలు

జిల్లాలో 17 మండలాల పరిధిలో 428 గ్రామ పంచాయతీల్లో సుమారు 2.63 లక్షల ఉపాధి కూలీలు, 1.44 లక్షల జాబ్ కార్డులు ఉన్నాయి. ఆయా మండలాల పరిధిలోని గ్రామ పంచాయతీల్లో 2026–27 సంవత్సరానికి గాను మొత్తం 58 రకాల పనులను చేపట్టనున్నారు. పనుల గుర్తింపునకు మండలాల వారీగా గ్రామాల్లో సభల నిర్వహణకు డీఆర్‌డీఏ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఒక్కొక్క మండలంలో పంచాయతీల సంఖ్యకు అనుగుణంగా గ్రామ సభలను మూడు నుంచి నాలుగు రోజులపాటు నిర్వహించనున్నారు. ఈనెలలో గ్రామ సభలు మొదలై నవంబర్ 30 తేదీ వరకు కొనసాగనున్నాయి. చేపట్టబోయే పనులను ప్రజల ఆమోదంతో గుర్తిస్తారు.

వీటికి మొదటి ప్రాధాన్యం

అన్ని మండలాల్లో రెగ్యులర్ ఉపాధి పనులతోపాటు భూగర్భ జాలాల వృద్ధికి ఫాంపాండ్స్, మ్యాజిక్ సోప్ పిట్స్, కమ్యూనిటీ సోప్‌పిఎట్స్, నీటి కుంటలు, ఇంకుడుగుంతల నిర్మాణాలు, చెరువులు, కాల్వల్లో పూడికతీత వివిధ రకాల వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ పనులకు మొదటి ప్రాధాన్యం ఉంటుంది.

వచ్చే ఏప్రిల్ నుంచి పనులు



గ్రామస్థాయిలో గుర్తించిన పనులను మండలానికి, అక్కడి నుంచి జిల్లాకు ప్రతిపాదనలు వచ్చిన తర్వాత ఆన్‌లైన్‌లో బడ్జెట్ కేటాయింపు జరుగుతుంది.ఈప్రక్రియ తర్వాత వచ్చే ఏప్రిల్ నుంచి పనులు మొదలవుతాయి. జల సంరక్షణ పనులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్రం నిర్ణయించింది. ఈ మేరకు కార్యాచరణ రూపొందించాం. త్వరలో గ్రామ సభలు ప్రారంభిస్తాం.

– నాగిరెడ్డి, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్

కాంగ్రెస్‌కు కంచుకోట నల్లగొండ

- బిశ్వరంజన్ మహంతి

మునుగోడు: నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి మంచి పట్టుందని ఏఐసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి బిశ్వరంజన్ మహంతి అన్నారు. నల్లగొండ డీసీసీ అధ్యక్షుడి ఎంపిక కోసం గురువారం మునుగోడులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన అభిప్రాయ సేకరణ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోనే మంచి పేరు ఉన్న నాయకుడని, ఆయనకు మంత్రి పదవి చాలా చిన్నదన్నారు. ఆయనకు తగిన పదవి దక్కుతుందన్నారు. రాజగోపాల్‌రెడ్డి ఆవేదన, కోరికను అధిష్టానం దృష్టికి తీసుకెళ్తానన్నారు. డీసీసీ అధ్యక్ష పదవి ఎవరికి ఇచ్చినా తాము పూర్తి మద్దతు ఇస్తామని రాజగోపాల్‌రెడ్డితో పాటు నియోజకవర్గ కార్యకర్తలు ఏకగ్రీవంగా అంగీకరించారు.



మునుగోడు నియోజకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న మహంతి, పక్కన రాజగోపాల్‌రెడ్డి

నేటి నుంచి అభిప్రాయ సేకరణ

డీసీసీ అధ్యక్షుడి ఎన్నిక ప్రక్రియ మొదలు

- జిల్లాకు చేరుకున్న ఏఐసీసీ పరిశీలకుడు
- నాలుగు రోజులు ఇక్కడే మకాం
- బ్లాక్‌ల వారీగా సమావేశాలు



యాదగిరిగుట్టలో ఏఐసీసీ పరిశీలకుడు శరత్‌రావత్‌కు స్వాగతం పలుకుతున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, డీసీసీ అధ్యక్షుడు సంజీవరెడ్డి తదితరులు

సాక్షి, యాదాద్రి: జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడి(డీసీసీ) ఎన్నిక ప్రక్రియ మొదలైంది. ఇందుకోసం అధిష్టానం నియమించిన ఏఐసీసీ పరిశీలకుడు శరత్‌రావత్ గురువారం రాత్రి జిల్లాకు చేరుకున్నారు. నాలుగు రోజుల పాటు ఆయన జిల్లాలోనే మకాం వేసి ప్రతి అంశాన్ని జల్లెడ పట్టనున్నారు. ఆలేరు, భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గాల్లో బ్లాక్‌ల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసి పార్టీలోని అన్ని వర్గాల నుంచి అభిప్రాయ సేకరణ చేస్తారు.

సమావేశాలు తేదీల వారీగా..

- శుక్రవారం ఉదయం భువనగిరిలో మీడియాతో మాట్లాడుతారు. అనంతరం జరిగే బ్లాక్‌స్థాయి సమావేశంలో పాల్గొని పార్టీలోని అన్ని వర్గాల నుంచి అభిప్రాయ సేకరణ చేసి, ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు.
- 18వ తేదీన ఆలేరు, యాదగిరిగుట్ట బ్లాక్‌స్థాయి సమావేశాలు నిర్వహించనున్నారు.
- 19న ఆదివారం భువనగిరి, భూదాన్‌పోచంపల్లి బ్లాక్‌స్థాయి సమావేశాల్లో పాల్గొంటారు.
- 20న భువనగిరిలో మరోసారి పార్టీ క్యాడర్‌తో సమావేశం ఏర్పాటు చేసి అభిప్రాయ సేకరణ చేయడంతో పాటు ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. ఇందుకోసం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఏర్పాట్లు పూర్తి చేసింది. డీసీసీ అధ్యక్ష పదవి రేసులో ఉన్న వారు దరఖాస్తులు ఇవ్వడానికి సిద్ధం అవుతున్నారు. ఏఐసీసీ పరిశీలకుడితో పాటు పీసీసీ కోఆర్డినేటర్లు సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి, శాప్ చైర్మన్ శివచరణ్‌రెడ్డి, హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి హాజరు కానున్నారు.

అప్పులు తీర్చేందుకు చైన్ స్నాచింగ్

- మహిళపై దాడిచేసి పుస్తెలతాడు అపహరించిన దొంగ
- 24 గంటల్లోనే పట్టుకున్న పోలీసులు
- స్కూటీ, రూ.2.50 లక్షల నగదు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

శాలిగౌరారం: అప్పులు తీర్చేందుకు గాను మహిళపై దాడి చేసి ఆమె మెడలోని పుస్తెలతాడు అపహరించిన దొంగను పోలీసులు 24 గంటలు గడువక ముందే అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను నకిరేకల్‌లోని శాలిగౌరారం సర్కిల్ కార్యాలయంలో నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి విలేకరులకు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం అన్నారం గ్రామానికి చెందిన నాగుల శ్రీనివాస్ వృత్తిరీత్యా చేనేత కార్మికుడు. ప్రస్తుతం అతడు కుటుంబంతో కలిసి నల్లగొండ పట్టణంలోని పద్మానగర్‌లో నివాసముంటున్నాడు. శ్రీనివాస్ గతంలో తన ఇద్దరు కుమార్తెల వివాహాలు చేసేందుకు గాను అప్పులు చేశాడు. దీనికి తోడు కరోనా సమయంలో అతడి భార్య అనారోగ్యానికి గురికావడంతో మరింత అప్పులు చేశాడు. అప్పులు ఎక్కువ కావడంతో పాటు వాటికి వడ్డీలు పెరిగిపోతుండటంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ క్రమంలో ఎలాగైనా అప్పులు తీర్చాలని శ్రీనివాస్ భావించాడు. ప్రస్తుతం బంగారం ధరలు విరీతంగా పెరగడంతో బంగారం దొంగతనం చేసినట్లైతే అప్పులు తొందరగా తీర్చవచ్చని అనుకున్నాడు. ఈ క్రమంలో బుధవారం నకిరేకల్ మండలం ఓగోడు గ్రామానికి చెందిన ఆవుల సావిత్రమ్మ శాలిగౌరారం మండలం మాధారంకలాన్ శివారులో ఉన్న తన వ్యవసాయ భూమి వద్దకు నడుచుకుంటూ వెళ్తుండగా.. శ్రీనివాస్ స్కూటీపై అటుగా వెళ్తూ.. సావిత్రమ్మను చూసి స్కూటీ ఆపాడు. ఎక్కడకు వెళ్తున్నావ్ అని ఆమెను అడగగా.. ఆమె మాధారంకలాన్ వెళ్తున్నానని చెప్పింది. తాను అటువైపే వెళ్తున్నానని చెప్పి ఆమెను శ్రీనివాస్ తన స్కూటీపై ఎక్కించుకున్నాడు. మాధారంకలాన్ గ్రామ పంచాయతీ పరిధిలోని చౌళ్లగూడెం వద్ద గల 365వ నంబర్ జాతీయ రహదారి జంక్షన్ సమీపంలోకి రాగానే టాయిలెట్ వస్తుందని స్కూటీని ఆపాడు. స్కూటీ దిగిన సావిత్రమ్మ రోడ్డు వెంట నడుచుకుంటూ చౌళ్లగూడెం జంక్షన్ వైపు వస్తుండగా.. వెనుక నుంచి స్కూటీపై వచ్చిన శ్రీనివాస్ ఇనుపరాడ్డుతో సావిత్రమ్మ తలపై విచక్షణారహితంగా కొట్టడంతో ఆమె కిందపడిపోయింది. శ్రీనివాస్ వెంటనే సావిత్రమ్మ మెడలోని నాలుగున్నర తులాల బంగారు పుస్తెల తాడును లాక్కొని స్కూటీపై పారిపోయాడు. దొంగిలించిన బంగారు పుస్తెల తాడును నల్లగొండ పట్టణంలోని మణప్పురం ఫైనాన్స్‌లో తాకట్టుపెట్టి రూ.3.11 లక్షలు రుణం తీసుకున్నాడు. అందులో నుంచి రూ.61వేలు సొంత అవసరాలకు వాడుకొని.. మిగిలిన రూ.2.50 లక్షలు ఇంట్లో పెట్టుకున్నాడు. బాధితురాలి కుమారుడు సైదులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదేశాల మేరకు శాలిగౌరారం, నకిరేకల్ సీఐల నేతృత్వంలో నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి నిందితుడు శ్రీనివాస్‌ను గురువారం అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. అతడి నుంచి ద్విచక్ర వాహనం, రూ.2.50 లక్షల నగదు, ఇనుప రాడ్డు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. నిందితుడిని కోర్టులో హాజరుపర్చిఐ జడ్జి ఆదేశానుసారం రిమాండ్‌కు తరలించనున్నట్లు తెలిపారు. డీఎస్పీ శివరాంరెడ్డి, శాలిగౌరారం, నకిరేకల్ సీఐలు కొండల్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, శాలిగౌరారం, నకిరేకల్, కేతేపల్లి ఎస్‌ఐలు సైదులు, లచ్చిరెడ్డి, సతీష్, పోలీస్ సిబ్బంది జానయ్య, లక్ష్మణ్, సతీస్, శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, సురేశ్, శ్రీకాంత్‌ను ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అభినందించారు.

హుజూర్‌నగర్‌లో వ్యవసాయ కళాశాల

మంత్రివర్గం ఆమోదం
- ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రారంభించేలా ప్రణాళిక
- తొలుత ప్రైవేట్ భవనంలో తరగతులు
- కొలిక్కివచ్చిన స్థల సేకరణ ప్రక్రియ!

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్‌కు వ్యవసాయ కళాశాల మంజూరైంది. ఈమేరకు రాష్ట్ర మంత్రివర్గం గురువారం ఆమోదం తెలిపింది. ఈ విద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ కాలేజీ కోసం ఇప్పటికే స్థల సేకరణ ప్రక్రియ దాదాపు పూర్తికావొచ్చినట్లు తెలిసింది.

కళాశాలలో ఉండే కోర్సులు

ఈ వ్యవసాయ కాలేజీ.. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ అగ్రికల్చర్ యూనివర్సిటీకి అనుబంధంగా ఉంటుంది. ఈ కాలేజీలో బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సు ఉంటుంది. దీనిలో వ్యవసాయానికి సంబంధించిన కోర్సులు ఉంటాయి. అగ్రానమీ, సాయిల్ సైన్స్, అగ్రికల్చర్ ఇంజనీరింగ్, పెథాలజీ, ఎంటమాలజీ, హార్టికల్చర్, న్యూట్రిషన్ తదితర వ్యవసాయ అనుబంధ కోర్సులు ఉంటాయి. నాలుగేళ్ల (బీఎస్సీ)కోర్సులో భాగంగా తొలి ఏడాది వంద మంది వరకు విద్యార్థులకు అడ్మిషన్లు ఇచ్చే అవకాశం ఉంది.

పూర్తికావొచ్చిన స్థల సేకరణ..

హుజూర్‌నగర్‌లో ఏర్పాటు చేయనున్న వ్యవసాయ కళాశాల కోసం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చొరవతో ఆచార్య జయశంకర్ తెలంగాణ అగ్రికల్చర్ యూనివర్సిటీ అధికారులు ఇటీవల నియోజకవర్గంలోని మండలాల్లో వివిధ చోట్ల అనువైన భూములను పరిశీలించారు. మొత్తం మీద హుజూర్ నగర్ శివారులోని మగ్దూం నగర్ వద్ద ఉన్న ప్రభుత్వ భూములు కళాశాల ఏర్పాటుకు అనుకూలంగా ఉన్నట్లు భావిస్తున్నారు. స్థల సేకరణ ప్రక్రియ దాదాపు పూర్తికావొచ్చినట్లు సమాచారం. ఈనేపథ్యంలో హుజూర్‌నగర్‌లో ప్రభుత్వం వ్యవసాయ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో ఈ ప్రాంత ప్రజల్లో హర్షం వ్యక్తం అవుతోంది.

ఈ విద్యా సంవత్సరం ప్రైవేట్ భవనంలో..

ఈ విద్యా సంవత్సరం నుంచే కళాశాల తరగతులు నిర్వహించాలని ప్రభుత్వం సంకల్పించింది. దీని కోసం హుజూర్‌నగర్ పట్టణంలోని ఏదైనా ప్రైవేట్ భవనంలో కళాశాల ఏర్పాటు చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. వ్యవసాయ కళాశాలలో బోధించేందుకు దాదాపు 25 మంది ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు రానుండగా, పాతిక మంది వరకు స్థానికులకు ఉద్యోగాలు దక్కనున్నాయి.

రైతులకు వ్యవసాయ సలహాలు

వ్యవసాయ కళాశాల ఏర్పాటుతో ఈ ప్రాంత రైతులకు వ్యవసాయం, అనుబంధ రంగాలకు సంబంధించి సరైన సూచనలు, సలహాలు అందే అవకాశం ఉంది. అదేవిధంగా సాంకేతిక సలహాలు లభించనున్నాయి. తద్వారా వారికి మరింత లబ్ధిచేకూరనుంది. ఈ కళాశాల ద్వారా నూతన వంగడాలు రైతులకు అందుబాటులో తీసుకొచ్చే అవకాశం ఉంది.

క్లుప్తంగా

యాదగిరి క్షేత్రంలో సుదర్శన హోమం


హోమం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం నిత్యారాధనలు ఆగమశాస్త్రానుసారంగా నిర్వహించారు. వేకువ జామున స్వామివారి మేల్కొలుపులో భాగంగా సుప్రభాత సేవ చేపట్టి, గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం, సహస్రనామార్చనతో కొలిచారు. అనంతరం ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు అష్టోత్తర పూజలు నిర్వహించారు. వివిధ పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి


నర్సమ్మ (ఫైల్)

మిర్యాలగూడ టౌన్: ఇంట్లో దుస్తులు ఆరేస్తుండగా విద్యుదాఘాతానికి గురై మహిళ మృతిచెందింది. ఈ ఘటన మిర్యాలగూడ మండలం ఉట్లపల్లి గ్రామంలో బుధవారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉట్లపల్లి గ్రామానికి చెందిన సిరశాల నర్సమ్మ(58) భర్త గతంలోనే మృతిచెందాడు. ఆమెకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు సంతానం. ఇంట్లో ఆమె ఒంటరిగానే నివాసముంటోంది. నర్సమ్మ ఇంటికి కొంత దూరంలో ఆమె కుమారుడు లింగయ్యకు నివాసముంటున్నాడు. బుధవారం కూలి పనులను వెళ్లిన నర్సమ్మ సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చింది. అనంతరం ఇంటి ఆవరణలో దుస్తులు ఉతికి పక్కనే ఉన్న ఇనుప తీగపై ఆరేస్తుండగా విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయింది. రాత్రి వేళ ఎవరూ చూడకపోవడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. గురువారం తోటి కూలీలు నర్సమ్మను కూలి పనులకు పిలిచేందుకు ఇంటికి ఆమె వెళ్లగా విగతజీవిగా పడి ఉంది. దీంతో ఆమె కుమారుడికి సమాచారం అందించారు. కాగా ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని మిర్యాలగూడ రూరల్ పోలీసులు తెలిపారు.

వ్యవసాయ బావిలో పడి..


లక్ష్మయ్య (ఫైల్)

అడ్డగూడూరు: వ్యవసాయ బావిలో పడి వృద్ధుడు మృతిచెందాడు. ఈ ఘటన అడ్డగూడూరు మండలం జానకీపురం గ్రామ శివారులో గురువారం వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జానకీపురం గ్రామానికి చెందిన కట్కూరి లక్ష్మయ్య(86) మంగళవారం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఎంత వెతికినా లక్ష్మయ్య ఆచూకీ లభించకపోవడంతో బుధవారం కుటుంబ సభ్యులు అడ్డగూడూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. గురువారం గ్రామ శివారులోని ఓ వ్యవసాయ బావిలో లక్ష్మయ్య మృతదేహం లభ్యమైంది. పోలీసులు ఘటనా స్థలానికి చేరకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కరెంట్ తీగలు తగిలి యువకుడు మృతి

- విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగిందని మృతుడి బంధువుల ఆరోపణ
- కొండమల్లేపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట మృతదేహంతో ధర్నా


విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న మృతుడి బంధువులు


వెంకటేష్ (ఫైల్)

కొండమల్లేపల్లి: పొలం వద్ద నేలపై పడి ఉన్న కరెంట్ తీగలు తగిలి యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన కొండమల్లేపల్లి మండలం చింతకుంట్ల గ్రామంలో గురువారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతకుంట్ల గ్రామానికి చెందిన జటమోని శ్రీను, వెంకటమ్మ దంపతుల పెద్ద కుమారుడు జటమోని వెంకటేష్(23) గురువారం ఉదయం తమ పొలం వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో పొలం గట్టు పైన నడుచుకుంటూ వెళ్తుండగా అప్పటికే నేలపై పడి ఉన్న విద్యుత్ తీగలు అతడి కాలుకు చుట్టుకోవడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. పొలం వద్దకు వెళ్లిన వెంకటేష్ ఎంతసేపటికీ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా పొలం వద్ద విగతజీవిగా పడి ఉన్నాడు. విద్యుత్ తీగలు నేలపై పడి ఉన్నాయని నాలుగు రోజుల క్రితమే ఫిర్యాదు చేసినప్పటికి లైన్‌మన్, విద్యుత్ అధికారులు పట్టించుకోకపోవడం తోనే ఈ ప్రమాదం జరిగినట్లు మృతుడి బంధువులు ఆరోపిస్తున్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట ధర్నా..

వెంకటేష్ మృతికి విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమే కారణమని పేర్కొంటూ అతడి బంధువులు, గ్రామస్తులు కొండమల్లేపల్లిలోని విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట మృతదేహంతో ధర్నా నిర్వహించారు. పోలీసులు, విద్యుత్ సబ్ స్టేషన్ అధికారులు నచ్చజెప్పి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. చేతికొచ్చిన కుమారుడి మరణంతో తల్లిదండ్రులు, బంధువుల రోధనలు మిన్నంటాయి. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అజ్మీరా రమేష్ తెలిపారు.

నూతనంగా నిర్మిస్తున్న ఇంటిపై నుంచి జారిపడి మృతి


కృష్ణారెడ్డి (ఫైల్)

భూదాన్‌పోచంపల్లి: నూతనంగా నిర్మిస్తున్న ఇంటిపై నుంచి ప్రమాదవశాత్తు జారిపడి వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన గురువారం భూదాన్‌పోచంపల్లి మండలం పెద్దగూడెం గ్రామంలో జరిగింది. మృతుడి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దగూడెం గ్రామానికి చెందిన రైతు పారిపల్లి కృష్ణారెడ్డి(55) గ్రామంలో నూతనంగా రెండంతస్తుల ఇంటిని నిర్మిస్తున్నాడు. గురువారం ఇంటి స్లాబ్‌కు క్యూరింగ్ చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి భవనంపై నుంచి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు, ఇరుగుపొరుగు వారు గమనించి చికిత్స నిమిత్తం కారులో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ డాక్టర్లు పరీక్షించి అప్పటికే కృష్ణారెడ్డి మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య జయమ్మ, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మతిస్థిమితంలేని వ్యక్తి..


మతిస్థిమితంలేని వ్యక్తి (ఫైల్)

తిప్పర్తి: తిప్పర్తి మండలం చిన్నాయిగూడెం సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మతిస్థిమితంలేని వ్యక్తి మృతిచెందాడు. ఎస్‌ఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 30ఏళ్ల వయస్సున్న మతిస్థిమితంలేని వ్యక్తి చిన్నాయిగూడెం వద్ద రోడ్డు దాటుతుండగా డీసీఎం వెనుక నుంచి అతివేగంగా ఢీకొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. గురువారం తిప్పర్తి పంచాయతీ కార్యదర్శి నర్సింహ స్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శంకర్ తెలిపారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

చందంపేట: నేరెడుగొమ్ము మండలం వైజాక్ కాలనీలో కృష్ణా నది వెనుక జలాల్లో గల్లంతైన నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం ఖానాపురం గ్రామానికి చెందిన తిన్నారపు పృథ్వీరాజ్ మృతదేహం గురువారం లభ్యమైంది. పృథ్వీరాజ్ మంగళవారం స్నేహితులతో కలిసి వైజాగ్ కాలనీలో సరదాగా గడిపేందుకు వచ్చాడు. అదే రోజు ఈత కొట్టేందుకు గాను కృష్ణా నది వెనుక జలాల్లోకి దిగి గల్లంతు కాగా.. గాలింపు చర్యలు చేపట్టిన ఎస్‌ఏడీఆర్‌ఎఫ్ బృందాలకు రెండు రోజుల తర్వాత గురువారం మృతదేహం లభ్యమైంది.

రౌడీ షీటర్ కొడుదుల నవీన్‌రెడ్డి నగర బహిష్కరణ

- నోటీసులు జారీ చేసిన రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు
- నవీన్‌రెడ్డి స్వస్థలం నల్లగొండ మండలం ముశంపల్లి

నల్లగొండ: రంగారెడ్డి జిల్లా మన్నెగూడకు చెందిన రౌడీ షీటర్ కొడుదుల నవీన్‌రెడ్డిని రాచకొండ పోలీసులు నగర బహిష్కరణ చేశారు. ఆరు నెలల పాటు రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎందుకు బహిష్కరించకూడదో 7 రోజుల్లో వివరణ ఇవ్వాలంటూ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు గురువారం నవీన్‌రెడ్డికి నోటీసులు జారీ చేశారు. నల్లగొండ మండలం ముశంపల్లి గ్రామానికి చెందిన కొడుదుల నవీన్‌రెడ్డి పదేళ్ల క్రితం హైదరాబాద్‌కు వలస వెళ్లాడు. అక్కడ అతడు మిస్టర్ టీ, మిస్టర్ ఇరానీ టీ ఫ్రాంఛైజీ పేరుతో బిజినెస్ చేస్తున్నాడు. అతనిపై రంగారెడ్డి జిల్లా ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో దాడి, హత్యాయత్నాలు, బెదిరింపులు, అల్లర్ల కేసులు నమోదయ్యాయి. రౌడీ షీటర్‌గా చెలామణి అవుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్న నవీన్‌రెడ్డితో శాంతిభద్రతలకు విఘాతం కల్గుతుందని భావించి నగర బహిష్కరణ చేసినట్లు అతడికి ఇచ్చిన నోటీసుల్లో రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు పేర్కొన్నారు.

కిడ్నాప్ ఉదంతంతో వెలుగులోకి..

2022 డిసెంబర్‌లో రంగారెడ్డి జిల్లా తుర్కయాంజల్‌కు చెందిన ఓ మహిళా డాక్టర్‌ను నవీన్‌రెడ్డి తన అనుచరులతో కలిసి సినీ ఫక్కీలో కిడ్నాప్ చేసి వార్తల్లో నిలిచాడు. వారిద్దరికి బ్యాడ్మింటన్ అకాడమీలో పరిచయం ఏర్పడగా.. నవీన్‌రెడ్డి ప్రేమను సదరు మహిళా డాక్టర్ నిరాకరించడంతో ఆమెపై ద్వేషం పెంచుకుని 40 మంది గూండాలను వెంటేసుకుని ఇంట్లోకి చొరబడి ఆమె నిశ్చితార్థం జరగకుండా అడ్డుకొని కిడ్నాప్ చేశాడు. ఆమె తండ్రి దామోదర్‌రెడ్డి ఆపడానికి యత్నించగా అతడిపై కూడా దాడి చేశాడు. ఈ ఘటన అప్పట్లో రాష్ట్ర వ్యాప్తంగా సంచలనమైంది.

అనారోగ్య సమస్యలతో మహిళ బలవన్మరణం

యాదగిరిగుట్ట : అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న మహిళ జీవితంపై విరక్తితో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన యాదగిరిగుట్ట పట్టణంలో గురువారం జరిగింది. పట్టణ సీఐ భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరిగుట్ట పట్టణంలోని యాదగిరిపల్లికి చెందిన ఈర్ల స్వప్న (35) కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. దీంతో మానసికంగా కృంగిపోయి జీవితంపై విరక్తితో గురువారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో బెడ్‌రూంలో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలికి భర్త గంగారాం, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఏసీబీకి చిక్కిన అగ్నిమాపక శాఖ అధికారి

- టపాకాయల దుకాణం ఏర్పాటుకు ఎన్‌ఓసీ ఇచ్చేందుకు లంచం డిమాండ్


సత్యనారాయణరెడ్డి, అగ్నిమాపక శాఖ అధికారి

నల్లగొండ: టపాకాయల దుకాణం లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకున్న వ్యక్తి నుంచి లంచం తీసుకుంటూ నల్లగొండ పట్టణంలోని అగ్నిమాపక శాఖ కార్యాలయం అధికారి సత్యనారాయణరెడ్డి గురువారం ఏసీబీకి చిక్కారు. ఏసీబీ డీఎస్పీ జగదీశ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. దీపావళి సందర్భంగా టపాకాయల దుకాణం ఏర్పాటు చేసుకునేందుకు గాను అనుమతి కోసం నల్లగొండ ఫైర్ స్టేషన్ అధికారి సత్యనారాయణరెడ్డిని ఓ వ్యాపారి సంప్రదించాడు. ఎన్‌ఓసీ మొత్తం తానే చేసి ఇస్తానని ఇవ్వాలని సదరు వ్యాపారిని సత్యనారాయణరెడ్డి రూ.10వేలు డిమాండ్ చేశాడు. చివరకు రూ.8వేలకు ఒప్పందం కుదిరింది. దీంతో సదరు వ్యాపారి ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. గురువారం నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కాలేజీ గ్రౌండ్‌లో వ్యాపారి నుంచి సత్యనారాయణరెడ్డి రూ.8వేలు లంచం తీసుకుంటుండగా నల్లగొండ రేంజ్ యూనిట్ ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. సత్యనారాయణరెడ్డిపై పలు అవినీతి ఆరోపణలు వచ్చాయని వాటిపై పూర్తిస్థాయిలో విచారించి నాంపల్లి ఏసీబీ కోర్టు ముందు హాజరుపరుస్తామని ఏసీబీ డీఎస్పీ తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు లంచం అడిగితే 1084 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.

ధాన్యం కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి


కల్వలపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

మునుగోడు: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మునుగోడు మండలంలోని పులిపలుపుల, కల్వలపల్లి గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉంటే రైతులు తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో చండూరు మార్కెట్ చైర్మన్ దోటి నారాయణ, ఎంపీడీఓ యుగేందర్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్లు సింగం వెంకన్న, ఎస్.శేఖర్‌రెడ్డి, సీఈఓ సుఖేందర్, మాజీ ఎంపీటీసీ భీమనపల్లి సైదులు, ఏఈఓ నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్ సేవలు ఉపయోగించుకోవాలి

- ఈఎంఆర్‌ఐ జీహెచ్‌ఎస్ రాష్ట్ర ఆడిట్ అధికారి పకీర్ దాస్


108 వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఈఎంఆర్‌ఐ జీహెచ్‌ఎస్ ఆడిట్ అధికారి పకీర్ దాస్

మిర్యాలగూడ అర్బన్: అత్యవసర సమయంలో 108 సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జీవీకే ఈఎంఆర్‌ఐ జీహెచ్‌ఎస్ రాష్ట్ర ఆడిట్ అధికారి పకీర్ దాస్ అన్నారు. గురువారం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిలో 108 వాహనాలను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అంబులెన్స్‌లో ప్రభుత్వం నిర్దేశించిన అన్ని రకాల పరికరాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని టెక్నీషియన్లకు సూచించారు. అంబులెన్స్‌లోని అత్యవసర సేవలకు ఉపయోగించే పల్స్ ఆక్సీమీటర్, మానీటర్, ఏఈడీ, ఆక్సిజన్ పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట 108 జిల్లా ప్రోగ్రాం మేనేజర్ సలీం, ఈఎంఈ యల్లావుల మధు, ఈఎంటీ వెలిజాల సైదులు, పైలెట్ పగిళ్ల జానకిరాములు తదితరులు పాల్గొన్నారు.

108 అంబులెన్స్ తనిఖీ

వేములపల్లి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద గల 108 అంబులెన్స్ వాహనాన్ని జీవీకే ఈఎంఆర్‌ఐ జీహెచ్‌ఎస్ రాష్ట్ర ఆడిట్ అధికారి పకీర్ దాస్ గురువారం తనిఖీ చేశారు. ఆయన వెంట కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం మేనేజర్ సలీం, ఈఎంఈ ఎల్లావుల మధు, సిబ్బంది విమల, అజ్రకుమార్ తదితరులున్నారు.

యాసంగిలో వేరుశనగ సాగు అనుకూలం

పాడిపంట

పెద్దవూర: వేరుశనగ సాగుకు యాసంగి అనుకూలమైదని పెద్దవూర మండల వ్యవసాయ అధికారి సందీప్‌కుమార్ పేర్కొన్నారు. నూనె గింజల ఉత్పత్తిని పెంచడానికి ఆహార నూనెల జాతీయ యంత్రాంగం పథకంలో భాగంగా ప్రభుత్వం రైతులకు నూరు శాతం సబ్సిడీపై వేరుశనగ విత్తనాలను కొన్ని మండలాల్లో పంపిణీ చేసింది. ఈ పంటను వానాకాలం సీజన్‌లో ఏ పంట విత్తని పొలాల్లో, స్వల్పకాలిక పంటలను సాగు చేసిన పొలాల్లోనూ సాగు చేసుకోవచ్చు.


బత్తాయి తోటలో అంతర పంటగా సాగవుతున్న వేరుశనగ

- శనగను ఆలస్యంగా విత్తినప్పుడు పంట చివరి దశలో బెట్టకు గురై అధిక ఉష్ణోగ్రత వలన గింజ సరిగా గట్టిపడక దిగుబడి తగ్గుతుంది.
- వేరుశనగ సాగు చేయడానికి ముందు 70 రోజుల కాలపరిమితి ఉన్న తృణధాన్యాలైన స్వల్పకాలిక కొర్ర రకాలు కూడా అందుబాటులో ఉన్నాయి.
- వేరుశనగను బంక నేలల నుంచి నల్లరేగడి వరకు ఏ భూమిలోనైనా పండించవచ్చు. చౌడు నేలలు, నీరు నిల్వ ఉండే నేలలు దీని సాగుకు పనికిరావు.

విత్తే విధానం

సాధారణంగా వేరుశనగ పంటను వర్షాధార పంటగా సాగు చేస్తుంటారు. విత్తడానికి సరిపడా తేమ లేనప్పుడు భూమికి ఒక తడి ఇచ్చి విత్తనం వేసుకోవచ్చు. విత్తేటప్పుడు విత్తనాన్ని ఐదు నుంచి ఎనిమిది సెంటీమీటర్ల లోతున తడి మట్టి తగిలేలా జాగ్రత్త తీసుకోవాలి.

- ఒక చ.మీ.కు 33 మొక్కలు ఉండేలా చూసుకోవాలి. నీటి వసతి ఉన్నప్పుడు లావు గింజలు కాబూలీ రకం ఎంచుకున్నప్పుడు వరుసల మధ్య 45 నుంచి 60 సెం.మీ. దూరం పాటించాలి.
- ట్రాక్టర్ ద్వారా వేరుశనగ విత్తు పరికరాన్ని వాడి పొలంలో మొక్కల మధ్య తగినంత సాంద్రత ఉండేలా చూసుకోవాలి. ఈ పరికరం ద్వారా విత్తనాన్ని, ఎరువును ఒకేసారి వేసుకోవచ్చు.

విత్తనశుద్ధి

విత్తనాన్ని విత్తుకునే ముందు ప్రతి కిలో విత్తనానికి పది గ్రాముల ట్రైకోడెర్మా విరిడి పొడిని, మూడు గ్రాముల థైరామ్ లేదా కాప్టాన్‌తో విత్తనశుద్ధి చేయడం వలన విత్తనం ద్వారా, నేల ద్వారా వ్యాపించే తెగుళ్లను చాలా వరకు అరికట్టవచ్చు. కిలో విత్తనానికి 1.5 గ్రాముల టెబ్యుకినజోల్ లేదా 1.5 గ్రాముల ఎటావాక్స్ పవర్‌ను కూడా విత్తనశుద్ధికి వాడవచ్చు. వేరుశనగను మొదటిసారి పొలంలో సాగు చేసినప్పుడు రైజోబియం కల్చర్ పొడిని విత్తనానికి పట్టించాలి.

ఎరువుల యాజమాన్యం

నేల స్వభావం, నేలలో లభించే పోషకాల మోతాదును బట్టి ఎరువులను వాడాలి. హెక్టారు శనగ సాగుకు 20 కిలోల నత్రజని, 50 కిలోల భాస్వరం అందించే ఎరువులను వేయాలి. నేలలో భాస్వరం నిల్వలు సరిపడా ఉన్నప్పుడు భాస్వరం ఎరువులు వేయాల్సిన అవసరం లేదు. అనిన ఎరువులను ఆఖరి దుక్కిలో వేయాలి. ఎకరాకు 18 కిలోల యూరియా, 125 కిలోల సింగిల్ సూపర్ ఫాస్పేట్ లేదా 50 కిలోల డీఏపీని వేస్తే పంటకు కావాల్సిన నత్రజని, భాస్వరం అందుతాయి. భాస్వరం ఎరువును సింగిల్ సూపర్ ఫాస్పేట్ రూపంలో వేస్తే పంటకు కావాల్సిన గంధకం కూడా అందుతుంది. విత్తనాన్ని విత్తిన 24 గంటల్లోగా ఫ్లూక్లోరాలిన్ ఎకరాకు 1 లీటర్, లేదా పెండిమిథాలిన్‌ను 1.2 లీటర్ల చొప్పున పిచికారీ చేస్తే కలుపును పంట తొలి దశలో సమర్థవంతంగా నివారించవచ్చు. పైరు విత్తిన 30 రోజుల వరకు పొలంలో కలుపు మొక్కలు లేకుండా చూసుకోవాలి.

తెగుళ్లు, సస్యరక్షణ చర్యలు

వేరుశనగ పంటలో ఎండు తెగులు ఆశించిన మొక్కలు ఒక్కసారిగా కాడలతో పాటు ముడుచుకుపోయి చనిపోతాయి. వేరు మరియు కాండాన్ని చీల్చి చూసినప్పుడు గోధుమ లేదా నలుపు రంగులో చార కనిపిస్తుంది. ఎండు తెగులును నివారించేందుకు వేసవిలో లోతుగా దుక్కి దున్నడం వల్ల ముందు పంట అవశేషాలు తీసేయడంతో తెగులు తీవ్రతను తగ్గించవచ్చు.

- వేరుశనగ పంటలో కుళ్లు తెగులు ద్వారా కాండం మొదలులో ఒక నొక్కు ఏర్పడి మొక్క చనిపోతుంది. తెగులు సోకిన తొలిదశలో తెల్లని శిలీంధ్రం బీజాలు ఆవ గింజల మాదిరి కాండం మీద కనిపిస్తాయి. నేలలో ఎక్కువ తేమ ఉండటం, అంతగా కుళ్లని సేంద్రీయ పదార్థం ఉండటం, ఎక్కువ ఉష్ణోగ్రతలు ఈ తెగులు ఉధృతికి తోడ్పడతాయి. విత్తిన పది నుంచి పదిహేను రోజుల తర్వాత పొలంలో మొదలు కుళ్లు గమనించినప్పుడు ఎకరాకు 200 గ్రాముల కార్బండిజమ్, 600 గ్రాముల మాంకోజెబ్‌ను వాడి మొక్కల మొదలు బాగం తడిచే విధంగా పిచికారీ చేయాలి.
- వేరుశనగ పండించే అన్ని ప్రాంతాల్లో శనగ పచ్చ పురుగు ఎక్కువగా నష్టం కలిగిస్తుంది. పురుగును తట్టుకునే రకాలు అందుబాటులో లేవు. పురుగు మందుల వాడకంతో వాటిని అరికట్టవచ్చు. పురుగు సంతతిపై నిఘా ఉంచడానికి పొలంలో ఒక మీటరు ఎత్తులో లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకుని పురుగు ఉధృతిని బట్టి నివారణ చర్యలు చేపట్టాలి.
- వేరుశనగ పంటలో పచ్చ రబ్బరు పురుగు నివారణకు ముందుగానే పంట వేసిన 15 రోజులకు ఒక లీటరు నీటిలో 5 మిల్లీలీటర్లు వేప నూనె కలిపి పిచికారీ చేయాలి. పురుగు ఉధృతి ఎక్కువైతే లీటరు నీటికి 200 మిల్లీలీటర్ల ఇండాక్సాకార్బ్ కలిపి పిచికారీ చేయాలి.

కోత సమయం

ఆకులు పచ్చబారడం, రాలిపోవడం, కాయలు పసుపుగా మారి మొక్కలు ఎండిపోయి గింజ గట్టిగా మారినప్పుడు కోత కోయాలి. పంట కోసిన వెంటనే గింజలను ఆరబెట్టాలి. నూర్పిడి యంత్రాలతో కానీ, చేతితో గాని నూర్పిడి చేసుకోవచ్చు. రైతులు ఈ విధానాన్ని పాటిస్తే మంచి దిగుబడితో పాటు నాణ్యమైన పంటను పొందవచ్చు.